క్లుప్తంగా

ఎస్సీ విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ విద్యార్థులంతా ఈ నెల 8వ తేదీలోపు తమ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని విద్యార్థులు పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఖాతా తెరిచి ఎన్‌పీసీఐ పోర్టల్‌లో ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. తల్లికి వందనం రెండో విడతలో భాగంగా 1వ తరగతి చదువుతున్న వారికి తల్లి బ్యాంక్ ఖాతాలకు, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న వారికి విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు నగదు జమ చేయనున్నట్లు చెప్పారు. ఆధార్ నంబర్‌ను బ్యాంక్ ఖాతాలకు అనుసంధానం చేసిన విద్యార్థులు బ్యాంక్ ఖాతా కాపీని తమ సచివాలయాలలోని వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శికి అందించి ఎన్‌పీసీఐ పోర్టల్‌లో అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

సరోజినీదేవికి చుండూరి నివాళులు


సరోజినీదేవికి నివాళులర్పిస్తున్న చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ అధ్యక్షుడు తేళ్ల విక్టర్‌పాల్ తల్లి సరోజినీదేవి ఆదివారం ఆకస్మికంగా మరణించారు. ఆమెకు పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకరరావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రాంకు ఘన నివాళి


బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న డీడీ లక్ష్మానాయక్

ఒంగోలు వన్‌టౌన్: భారత దేశ మాజీ ఉప ప్రధాని, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం 39వ వర్ధంతిని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరక్టర్ ఎస్ లక్ష్మా నాయక్ మాట్లాడుతూ జగ్జీవన్ రాం జీవితం ఆదర్శనీయమన్నారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యు బ్రహ్మయ్య మాదిగ, ఒంగోలు ఏఎస్‌డబ్ల్యూఓ రజియా బేగం, కార్యాలయం పర్యవేక్షకుడు డి మధుసూదన్ రావు, ఒంగోలు సహాయ సంక్షేమ అధికారి పరిధిలోని అన్ని వసతిగృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది, దళిత నాయకులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

దర్శి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్ సీపీఐ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ అప్రెంటిస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించి ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్పీఎస్, సీపీఎస్ పెన్షన్ విధానానికి బదులు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేసి కార్మికుల ఐక్యతను కేంద్ర ప్రభుత్వానికి తెలియచేయాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్ కరుణానిధి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సింగరకొండ శ్రీను, జూపల్లి కోటేశ్వరరావు, వి.శ్రీను, బిజ్జాల శ్రీను, శివయ్య, ఆరుసూరి బాబు, ఇత్తడి ఇర్మియా, గొంగటి శ్రీకాంత్, కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు


ఒంగోలు ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు


పెళ్లూరు జ్వాలాముఖి శక్తిపీఠంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు
- ప్రత్యేక అలంకరణలో కలియుగ నాథుడు

ఒంగోలు మెట్రో: ఆషాఢ మాసం తొలి ఏకాదశి పండుగ పర్వదినాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వైష్ణవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒంగోలు కేశవస్వామిపేటలోని ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో, మంగమూరుడొంక హరిహరసుత అయ్యప్పస్వామి క్షేత్రంలో, వలేటివారిపాలెం కోదండ రామస్వామి దేవస్థానం (రామ క్షేత్రం)లో, పెళ్లూరు గ్రామంలోని జ్వాలాముఖి అమ్మవారి శక్తిపీఠంలో విశేష పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా రమావసుంధర సమేత శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. సామూహికంగా 200 మంది దంపతులు పాల్గొని వ్రతం ఆచరించారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం

తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఒంగోలు పప్పుబజారులోని సీతారామస్వామి మందిరంలో స్వామివారికి 65వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో చూడచక్కగా కళ్యాణ వేదిక ఏర్పాటు చేసి సీతారామచంద్ర ప్రభువుని కొలువుదీర్చారు. భక్తుల హర్షధ్వానాల మధ్య అర్చకులు శుభ ముహూర్తాన దేవేరులకు కంకణధారణ చేశారు. స్వామి, అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం ఉంచి కన్యాదానం చేశారు. భక్తజన సందోహం నడుమ మాంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ, మాల మార్పిడి క్రతువులను శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. ఆలయాలలో హరే రామ, హరే కృష్ణ పాటలతో భజనలు చేశారు. తొలిఏకాదశి విశిష్టత గురించి పురోహితులు మైక్ ద్వారా భక్తులకు వివరించారు. ఆలయాల్లో టెంకాయలు, పండ్లతో హారతులిచ్చారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ముస్లింలు మొహర్రం పండుగను వేడుకగా జరుపుకున్నారు. మసీదుల్లో నమాజ్‌లు చేశారు. పీర్లను ఘనంగా ఊరేగించారు.


పప్పుబజారులోని సీతారామస్వామి మందిరంలో సీతారామ కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


పర్యాటకులతో కళకళలాడుతున్న కొత్తపట్నం బీచ్

సాగర తీరంలో సందడి

- పర్యాటకులతో కళకళలాడిన కొత్తపట్నం బీచ్

కొత్తపట్నం: ఎన్నో ప్రకృతి దృశ్యాలకు నిలయమైన సాగర తీరం ఆదివారం యాత్రికలతో కళకళలాడింది. ఆదివారంతో పాటు తొలి ఏకాదశి పండుగ కావడంతో పర్యాటకులు, భక్తులు కొత్తపట్నం బీచ్‌కి అధిక సంఖ్యలో చేరుకున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు బీచ్‌కు తరలి రావడంతో కొత్తపట్నం రహదారులు రద్దీగా మారాయి. ప్రత్యేక వాహనాల్లో తీరానికి వచ్చిన యువకులు, చిన్నారులు, మహిళలు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా సముద్రస్నానం ఆచరించారు. అలలతో ఆడుకుంటూ సరదాగా గడిపారు. సముద్రపు ఒడ్డున సెల్ఫీలు దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకులతో కొత్తపట్నం బీచ్ రద్దీగా మారింది. ఉదయం సముద్రం పోటు సమయం కావడంతో అలల ఉధృతి అధికంగా ఉన్నప్పటికీ.. మధ్యాహ్నం నుంచి వాతావరణం అనుకూలంగా ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సముద్రతీరానికి వచ్చిపోయే వారితో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు


శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్యకల్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఎన్ఎస్ కల్యాణ్ చక్రవర్తి వికసిత భారత్ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి కల్యాణ్ చక్రవర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏక్ దేశ్ మే దో విధాన్ – ఏక్ దేశ్ మే దో నిశాన్ – ఏక్ దేశ్ మే దో ప్రధాన్ నహీ చలేంగే నహీ చలేంగే అంటూ కాశ్మీర్ కోసం పోరాడిన గొప్ప మహనీయులు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. అనంతరం వెంకటేశ్వరకాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాంబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు, జనసేన నాయకుడు పిల్లి రాజేశ్, బీజేపీ ఒంగోలు మండలం – 5 అధ్యక్షుడు వంశీకృష్ణ, బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి


బొగ్గుల శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మాజీ వైస్ ఎంపీపీ బొగ్గుల శ్రీనివాసరెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నియమించారు. 2012లో ప్రకాశం జిల్లా రూరల్ ఇండస్ట్రీస్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ సెల్ కన్వీనర్‌గా ఆయన పనిచేశారు. 1995లో మర్రిపూడి మండల వైస్ ఎంపీపీగా పనిచేశారు. తనకు రాష్ట్ర స్థాయి పదవి రావడానికి కృషి చేసిన పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన శ్రీనివాసరెడ్డికి పార్టీ నాయకులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

నగదు బదిలీ వద్దు.. ప్రజా పంపిణీ ముద్దు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

దొనకొండ: నగదు బదిలీ పేరుతో ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసే ఆలోచన విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కుందుర్తి అనిల్ అధ్యక్షతన ఆదివారం ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే అది పేదల ఆకలి సమస్యను పెంచటమే కాక, రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఉండదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ 2 సీజన్లు కలిపి రాష్ట్రంలో 50 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించిందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ లేకపోతే అంత మొత్తంలో ధాన్యాన్ని సేకరించే అవకాశం ఉండదని, ఫలితంగా ధాన్యం ధర గిట్టుబాటు కాక రైతులు దెబ్బ తింటారన్నారు. అసలే వ్యవసాయ సంక్షోభంలో ఉన్న రైతాంగం ఆత్మహత్యలు మరింత పెరుగుతాయని గుర్తు చేశారు. బదిలీ పథకంతో చౌక ధరల దుకాణాలు తొలగిస్తే నిత్యావసర వస్తువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి ప్రజలు కొనలేని స్థితి ఏర్పడుతుందన్నారు. నగదుకు ఆహారం సరుకులే కొనుగోలు చేస్తారనే గ్యారంటీ లేదని, అవి దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని, ఫలితంగా పేద కుటుంబాలు ఆహార భద్రతకు లోనవుతారని గుర్తు చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ లేకపోతే అందులో పనిచేసే వేలాది కార్మికులు, హమాలీల జీవితాలు అన్యాయం అవుతాయని ఆంజనేయులు తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ రేషన్ సరుకుల వాహనాలను రద్దు చేసినందున ప్రజలు తీవ్ర ఆవేదనలో ఉన్నారని, రేషన్ షాపులు కొన్ని గ్రామాలకు 2, 3 కిమీ దూరంలో ఉన్నాయని, అంత దూరం నుంచి రావటానికి పని మానుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. బియ్యం అక్రమ మార్గం పట్టకుండా ఉండాలంటే సన్న బియ్యాన్ని చౌక ధరల దుకాణం ద్వారా ప్రజలకు అందించాలని అంజయ్య కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమ ల్లోకి తేవాలని అంజయ్య కోరారు. సమావేశంలో ప్రజా సంఘ కార్యకర్తలు యం.అంజిబాబు, యం.సంతోష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధ గాంచిన పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం తొలి ఏకాదశి కావడంతో వేకువజామున నుంచే జిల్లానలుముల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు మెట్టిల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు.

శాస్త్రోక్తంగా రాహుకాల హోమం

- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు


ఒంగోలు బాపూజీ గో సంఘంలో రాహు కాల దీపాలతో మహిళలు

ఒంగోలు మెట్రో: వారాహి నవరాత్రుల సందర్భంగా ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఒంగోలు బాపూజీ గో సంరక్షణ సంఘం గోశాలలో గోత్రిరాత్ర హోమం నిర్వహించారు. గో ఉపాసకుడు సురాభిదాసు బ్రహ్మశ్రీ కుందుర్తి మహీకిరణ్ శర్మ యాగ్నికత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాహుకాలంలో శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం రాహుకాల హోమం నిర్వహించారు. యజ్ఞ క్రతువులో శాస్త్రోక్తంగా సమిధలను మంత్రించి హోమాగ్నిని రగిలించారు. మహికిరణ్‌శర్మ భక్తులందరిచే దేవీఖడ్గమాల స్తోత్రాన్ని పఠింపజేశారు. అనంతరం లలిత శ్రీనివాస్ ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. భరతనాట్యంతో చిన్నారి మహిత ఆహూతులను అలరింపచేశారు. ఆదివారం రాహు కాల సమయంలో దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలదరిచే గౌరీవ్రతం, కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూర్ణాహుతిలో పాల్గొన్నారు.

వెంకటేశ్వరుడిని దర్శించుకున్న ఈజీఎస్ డైరెక్టర్


ఈజీఎస్ షణ్ముఖ కుమార్‌కు స్వామివారి శేషవస్త్రం వేస్తున్న ఆలయ అర్చకుడు వెంకటాచార్యులు

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వెంకటేశ్వరస్వామిని రాష్ట్ర ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆయన తిరుపతి వెళ్తూ మార్గం మధ్యలో మల్లవరం వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా ఆయనను శ్రీవారి వనం సభ్యులు పలువురు కలిసి స్వామివారివనంలో కొన్ని రకాల మొక్కలు కావాలని, వాటిని తాము సంరక్షించడానికి తగు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అదే విధంగా కొండ దిగువ భాగంలో స్వామివారికి కోనేరు ఏర్పాటు చేయడానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఎంపీడీఓ వి.జ్యోతి, ఏపీఓ ధనంజయవర్మ, శ్రీవారి వనం సభ్యులు కృష్ణారావు, సుబ్బారావు, వాసు, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏవో మోహన్‌రెడ్డికి వీడ్కోలు


ఏవో మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న సుభాషిణి, కిషోర్‌బాబు, సిబ్బంది

కొత్తపట్నం: మండల వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అనేక సేవలు అందించి మన్ననలు పొంది బాపట్ల జిల్లాకు బదిలీపై వెళుతున్న ఏవో మోహన్ రెడ్డికి ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. కొత్తపట్నం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు వ్యవసాయ శాఖ ఏఓ జి.కిషోర్‌బాబు అధ్యక్షత వహించారు. ముందుగా మోహన్‌రెడ్డికి ఆత్మీయ సన్మానం చేశారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోహన్‌రెడ్డి కొత్తపట్నంలో పనిచేసినంత కాలం మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. తాము ఏ పని చెప్పినా వెంటనే చేసేవారని, అందరికీ జవాబుదారీగా ఉండేవారని గుర్తు చేశారు. పైస్థాయి ఉద్యోగులతో ఎంతో గౌరవంగా, మర్యాదగా ఉండేవారని తెలిపారు. కింది స్థాయి ఉద్యోగులతో కూడా ఎంతో మంచిగా ఉండేవారన్నారు. ఇదే విధంగా బాపట్ల జిల్లాలో కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూడా మోహన్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అజయ్ బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, రెడ్డప్ప, వీఏఏలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని నిరసన


డంపింగ్ యార్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చీమకుర్తి రూరల్: మండలంలోని కందూరివారి అగ్రహారం గ్రామ సమీపంలో ఉన్న చీమకుర్తి మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డుని వేరొక ప్రదేశానికి తరలించాలని ఆ గ్రామ ప్రజలు ఆదివారం ఆందోళనకు దిగారు. తమ ఆరోగ్యాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డులో చెత్త తగలబెట్టడంతో దాని నుంచి వెలువడిన దట్టమైన పొగ మంచులాగా గ్రామాన్ని చుట్టిముట్టింది. గ్రామస్తులకు ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తి దగ్గు, జలుబు, తలనొప్పి, చర్మవ్యాధులు, కళ్లు మంటలు వంటి అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడ్డారు. డంపింగ్ యార్డుని వేరొక ప్రదేశానికి తరలించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆదివారం కూడా యథావిధిగా చెత్త తగలబెట్టడం వలన తామంతా ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు.

డంపింగ్ యార్డుని వెంటనే తరలించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వి.ఏడుకొండలు, పి.సుబ్బారావు, కె.తిరుమల, పి.రామారావు, పి.ఆంజనేయులు, జి.సుబ్బారావు, శివ, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

556 మందికి వైద్యసేవలు


దాచూరి మెడికల్ క్యాంపులో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని నెల్లూరు బస్టాండు సెంటర్‌లో గల టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 556 మందికి వైద్య సేవలు అందించారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగింది. అవసరమైన వారికి మందులను రెండు నెలలకుగానూ కేవలం రూ.200కే అందజేశారు. స్పెషలిస్ట్ వైద్యులు గోపాళం శ్రీమన్నారాయణ, రంజిత్ బాషా, హరిబాబు, శ్రీధర్‌బాబు, సమీర్, సుందర ప్రసాద్ వైద్య సేవలందించారు. క్యాంపు నిర్వాహకుడు మాదాల వెంకటరావు, 120 మంది ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొని సేవలందించారు.

మామిడిపాలెం చెరువు వద్ద 50 మందికి...

ఒంగోలు నగరంలోని మామిడిపాలెం చెరువు వద్ద శ్రీరామ్‌సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 50 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ, స్త్రీల వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ చాపల శాంత కుమారి, వైద్యులు సానల ధీరజ్‌బాబు, షేక్ లాల్, జీఎం బైరెడ్డి ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో అన్నదానం


బధిరుల పాఠశాలలో అన్నదానం చేస్తున్న సభ్యులు

చీమకుర్తి: చీమకుర్తి బధిరుల పాఠశాలలో సంతనూతలపాడుకు చెందిన వాసవీ క్లబ్, మహిళా క్లబ్ మాజీ అధ్యక్షులు గ్రంధి బద్రీనారాయణ, పద్మజ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. వారి కుమారుడు అభిరామ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించగా, వాసవీ క్లబ్ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.